# శూరఖడ్గము

నెపోలియన్ చక్రవర్తి జర్మనీదేశమును జయించి, ఆస్ట్రియాదేశమును స్వాధీనపరచుకొనుటకై సేనాసమేతముగా 'స్కోన్‌బ్రన్' నగరమందొక రాజభవనమున మకాముచేసియుండెను. ఆస్ట్రియారాజుతో సంధికై రాయబారములు నడుచుచుండెను. రాయబారముల అంతు తేలనందున చక్రవర్తికి ఆత్రము హెచ్చుగానుండెను. ఈ అవస్థలో రాజభవనమందొకమూల చక్రవర్తి ఒంటరిగా దీర్ఘాలోచనాపరుడై కూర్చుండెను.

*　　　*　　　*

నూనూగుమీసాల నవయువకు డొకడు నెపోలియన్ విడిసియున్న భవనములోపలికి నదురు బెదురు లేకుండా చొచ్చుకొనిపోవుచుండెను. అతని వయస్సు సుమారు పదునెనిమిది సంవత్సరములుండవచ్చును. పహారాజవానులాయువకుని అటకాయించిరి.

ప. జ:—నీ వెవ్వడవు? ఎచటికిపోవలెనని నీయుద్దేశము?

యువ:—(నిర్లక్ష్యము గా) నాకు మీతో పనిలేదు. నే నెవ్వడ నైతే మీకేమి? నేను నెపోలియన్ చక్రవర్తి దగ్గరకు పోతున్నాను. అక్కడికెడితే అన్ని సంగతులు మీకే తెలుస్తాయి.

పహారాజవానులు ఆ యువకుని అరెస్టుచేసి సోదా చేశారు. అతనిదగ్గర పొడుగుపాటి శూరఖడ్గము, ఒక యువతీమణిచిత్రము దొరికినవి. జవానులాతని చక్రవర్తిదగ్గరకు తీసుకొనిపోయారు. నెపోలియన్ అతని ముఖమును తేరిపారిచూచాడు. యౌవనలాలిత్యము, కార్యదీక్ష ఆయువకునియందు మూర్తీభవించియున్నటుల చక్రవర్తి గుర్తించాడు.

*　　　*　　　*

చక్రవర్తి:—యువకుడా! నీవెవ్వరవు? నీ పేరేమి?

యువకుడు:—(అతిమర్యాదగా) నే నొక జర్మనుయువకుడను. నా పేరు ఫ్రెడరిక్ స్టాప్స్. నా తండ్రి హైరోలిస్ పట్టణమందొక మతప్రచారకుడు.

చక్ర:—అయితే నీ విక్కడి కెందుకొచ్చావు?

యువ:—ఎందుకా? నీప్రాణాన్ని తీయడానికి.

చక్ర:—(అదరిపడి)—ఏమిటీ! నాప్రాణాలుతీస్తావా! నీకేమైనా పిచ్చెత్తిందా? లేక వెర్రెత్తిందా? అదీ కాకపోతే ఏమైనాజబ్బా?

యువ:—నాకు పిచ్చిలేదు. వెర్రిలేదు. జబ్బంతకన్నా లేదు. పూర్ణమైన తెలివితేటలతో బుద్ధిపూర్వకంగా నిన్ను చంపడానికే వచ్చాను.

చక్ర:—నన్నెందుకు చంపదలచినావు? నేను నీకేమి అపకారము చేశాను?

యువ:—ఎందుకా? నాదేశాన్ని నాశనం చేస్తున్నావు కనుక. జనాన్ని నాశనంచేసే ఈ యుద్ధాలేమిటి?

చక్ర:—ఏమిటీ. నీదేశాన్ని నాశనంచేస్తున్నానా?

యువ:—ఆ! అవును. నాదేశాన్నే, నాజర్మనీదేశాన్ని, దేశభక్తులగు జర్మనులదేశాన్ని.

చక్ర:—ఓ యౌవనుడా! ఈ బుద్ధి నీకేపుట్టినదా లేక నిన్నెవ్వరైనా ప్రేరేపించినారా?

యువ:—నన్నెవ్వరు ప్రేరేపించలేదు. నాకు పుట్టిన బుద్ధే ఇది. నిన్ను హత్యచేస్తే నాజన్మభూమియైన జర్మనీదేశానికి, యూరోపుఖండానికి కూడా మహత్తరమైన ఉపకారం చేసినవాడ నవుతానని నా అంతరాత్మ చెపుతోంది.

చక్ర:—(నిశ్చేష్టుడై)—నన్నిదివర కెప్పుడైనా చూశావా?

యువ:—ఆ! చూశాను. ఇర్‌ఫర్టుపట్టణంలో. అప్పుడు నీధైర్యసాహసాలకీ, నీ యుద్ధనైపుణ్యానికీ చాలా ఆనందించి నిన్ను ఆరాధిస్తూ ఉండేవాడిని. అప్పట్లో నీ వింక యుద్ధాలు చెయ్యవనుకున్నా.

ఫ్రెడరిక్ సాహసాన్ని నిర్భయత్వాన్ని చూచి చక్రవర్తి దిగ్భ్రమచెందేడు. ఆయువకు డున్మాదుడేమోనని సంశయం కలిగింది. రాజు తలుచుకుంటే దెబ్బలకేమి కొదువ? చక్రవర్తివద్ద ఉండే ఘనవైద్యులంతా పరీక్ష చేశారు. కాని ఉన్మాదలక్షణాలేమీ కనుపించలేదు.

ఆతడున్మాదుడుకాడని వైద్యులు నిర్ధారణ చేశారు. 'వైద్యమెందుకు? నే నాసంగతి ముందే చెప్పానుగా!' అని ఆయువకుడు రెట్టించాడు. చక్రవర్తి మనస్సు కలవరపడడం ఆరంభించింది. ఆ యువకుని ధైర్యసాహసములు, అచంచలత్వము చక్రవర్తికి ఆశ్చర్యమును కలుగచేశాయి. హంతకులయెడల నెపోలియన్ ఎప్పుడూ దయాదాక్షిణ్యాలుచూపి ఎరగడు, కాని ఫ్రెడరిక్ యౌవనము, ధీరత్వము ఆయనయం దొకగొప్పమార్పును కలుగజేసినాయి. దేశభక్తిప్రేరితుడును, సాహసాంకుడునగు ఆ నవయువకుని ప్రాణములతీయుట కాయన మనసొప్పకుండెను. ఆ యువకునియం దొకదుష్టకను పడదు. ఒక కక్షీ లేదు. ఏదేని యొక మహత్తరసిద్ధాంతమును మైలపరచుచున్నాడాయనిన అదీ లేదు. ఆ సందర్భములో తనదేశహితమును కోరేటటువంటి యువకుని తుపాకి కెరవేయడం అంటే చక్రవర్తికి పచ్చివెలక్కాయ గొంతుకపడినటులుండెను. ఎంతసేపాలోచించినా ఈ సమస్యకు సమాధానంరాలేదు. ఆ అవస్థలో సీజరు చక్రవర్తి హత్యకు కారకుడైన బ్రూటస్ నెపోలియన్ కండ్లఎదుట స్వప్నప్రాయముగా కనబడినాడు. ఆనాటి బ్రూటసే నేడు ఫ్రెడరిక్ రూపంలో జర్మనీదేశంలో అవతరించాడా అనే భ్రమ కలిగింది. ఇంతలో ఒక్కసారిగా నెపోలియన్ యందున్న సహజధైర్యం ప్రకోపించింది. అనామకుడైన ఎవడో ఒక యువకుని బెదరింపులకు అదరడం ఎందుకని మనస్సును చిక్కబట్టుకున్నాడు. ఏలాగైనా ఆ యువకుని ప్రాణమును కాపాడవలెనని అతనితో సంభాషణ మొదలుపెట్టాడు.

చక్ర:—ఓ యువకుడా! నిన్నెవ్వరో ఈ పాడుపనికి ప్రేరేపించినటులు కనబడుతుంది. ఈ హంతక కార్యమువలన నువ్వు, నీకుటుంబంకూడా నాశనమైపోతారు. హంతకులను సామాన్యంగా నే నెప్పుడూ క్షమించను. కాని నీయౌవనకోమలత్వం, నీధైర్యం చూచి నా మనస్సు కరిగింది. క్షమాపణవేడుకో, నీప్రాణాన్ని రక్షిస్తాను. కొంతపశ్చాత్తాపమును సూచిస్తే చాలు. నేను క్షమిస్తాను.

యువ:—ఓహో! క్షమాపణా! ఎందులకీ క్షమాపణా? నీదయాదాక్షిణ్యములు నాకక్కరలేదు. నా కణుమాత్రమైనా పశ్చాత్తాపం కలగడంలేదు. కాని నాప్రయత్నం విఫలమైనందుకుమాత్రం చాలా విచారపడుతున్నాను!

చక్రవర్తి తోకత్రొక్కిన త్రాచులాగున ఉగ్రుడైపోయాడు. "ఓ, రాక్షసీ! మహాద్రోహము తలపెట్టికూడా నీకు పశ్చాత్తాపము కలుగుటలేదా? సరే" అని హుంకరించాడు.

"ద్రోహమా? నిన్ను చంపితే ద్రోహమా? కాదు. కాదు! ముమ్మాటికి కాదు! అపరాధమేమియులేదు సరిగదా బ్రహ్మాండమైన ప్రజాసేవకూడాను." అని ఠీవిగా, నిష్కర్షగా ఫ్రెడరిక్ జవాబిచ్చాడు.

నెపోలియన్ ఆ యువకునివద్ద దొరికిన యువతి చిత్రాన్ని చేతబట్టి తదేకదీక్షతో చాలాసేపు పరీక్షించి "హూం! హూం! ఈ బొమ్మ ఎవరిది?" అని అడిగాడు.

"నేను ప్రేమించుచున్న యువతి."

"నీదారుణకృత్యాన్ని ఆమె అంగీకరిస్తుందా?"

"ఆహా! పని పూర్తికాలేదని విచారిస్తుంది కూడాను. నాకన్న ఆమెకే నీవంటే పరమసహ్యం."

ఈ సంభాషణ చక్రవర్తికి మరింత సంకటము కలిగించింది. గోరుచుట్టుమీద రోకటిపోటయింది. అయినా ఆచిత్రంలోని యువతీమణి సౌందర్యాన్నిచూచి ఆనందిస్తూ అదివరలో కలిగిన ఆగ్రహాన్ని శాంతపరిచాడు. 'ఆ యువకునికి నామీద ద్వేషముంటే ఉండుగాక! నే నాతని క్షమించకూడదా?' అని తనలో తానే ప్రశ్నించుకున్నాడు. క్షమిస్తేనే మంచిదని నిశ్చయించుకున్నాడు. చిత్రాన్ని చేత్తోపట్టుకుని "ఓ యౌవనుడా! నిన్ను నేను క్షమించినటులైతే ఈ యువతి చాలా సంతోషిస్తుందనుకుంటాను! ఏమంటావు?" అని అడిగాడు.

ఫ్రెడరిక్ ఆశ్చర్యముతోనూ, సంభ్రమముతోనూ చక్రవర్తికేసి తేరిపారిచూశాడు.

"ఓహో! అయితే చివరకు నిన్ను నేను చంపగలనన్నమాట" అని సంతోషముతో జవాబిచ్చాడు.

నెపోలియన్‌కు కోపం, విసుగు వచ్చింది. 'నీ కర్మం నీదే పో' అని ఫ్రెడరిక్‌ను తన ఎదుటినుండి పంపేశాడు.

*　　　*　　　*

ఎదుట లేకపోయినా ఫ్రెడరిక్ మూర్తి నెపోలియన్‌కు ప్రత్యక్షమగుచునే యుండెను. ఏ రాజకార్యాని కుపక్రమించినా ఆ యువకుని ధీరవర్తనమే ఆతని స్మృతికి వస్తూవచ్చింది. ఎంత ప్రయత్నించినా మరపు అసంభవమైపోయింది. చక్రవర్తి ఆత్మపరీక్ష చేసుకున్నాడు. ఆ యువకుడు తనపాలిటి హెచ్చరిక దేవతేమోనని సంశయించడం ప్రారంభించాడు. అపశకునసంబంధమగు నేదో యొక అనుమాన మాతని బాధించుచుండెను. ఆ యువకుని ప్రాణమును కాపాడు నుద్దేశ్యముతో మరల వైద్యపరీక్ష చేయించెను. కాని రోగచిహ్నమావంతయైన కనుపించలేదు పశ్చాత్తాపమసలేలేదు. క్షమాపణకన్న చచ్చిపోతే మేలని ఆ యువకుడు భీష్మించియుండెను.

*　　　*　　　*

యూరోపుఖండము నంతటిని గజగజ లాడించిన నెపోలియన్ సామ్రాట్ ప్రాణముల తీయుటకై ప్రయత్నించినందులకు ఫ్రెడరిక్ స్టాప్సునకు మరణదండన విధింపబడెను. మరునాటి ఉదయమున రాజభవనమున ఆస్ట్రియాసంధిపత్రముపై సంతకములు చేయబడెను. వేరొకచోట ఫిరంగిఎదుట ఫ్రెడరిక్ నిలబడియున్నాడు. ఆతని చేతులను సంకెళ్లు బంధించినవి. ఆ ధీర యువకుని ముఖమునం దణుమాత్రమైన విచారచిహ్నము కనుబడుట లేదు. ఫిరంగి 'ధాం'మని బ్రహ్మాండము బ్రద్దలగునట్లు శబ్దము చేసినది. కాని ఆ యువకుని జయధ్వానము ఫిరంగిశబ్దమును ముంచివేసినది. "నిరంకుశత్వ మంతమగుగాక!" అను ఆ యువకుని నోటినుండి వెలువడిన శబ్దము మిన్ను ముట్టినది.

*　　　*　　　*

నెపోలియన్ చక్రవర్తి దిగ్విజయయాత్ర ముగిసినది. ఫ్రెడరిక్ స్టాప్సుదగ్గరనుండి గ్రహింపబడిన శూరఖడ్గము ప్యారిస్ రాజభవనము నలంకరించినది. నెపోలియన్ జీవించినంతకాలము 'నిరంకుశత్వ మంతమగుగాక' యను మాట లాతని చెవులలో గింగురుమనుచునే యుండెను.

*　　　*　　　*

నిరంకుశత్వ మంతమైనది. ఫ్రెడరిక్ కోరిక సిద్ధించినది. యూరోపులోని సామ్రాజ్యములను గడగడ లాడించిన 'పురుష' ఇరువదిసంవత్సరములలో సెంటుహెలీనా దీవియందు బ్రిటిష్‌వారి బందీయై నికృష్టజీవనము గడిపి నిర్భాగ్యుడై మరణించెను.

—క్రొవ్విడి లింగరాజు.

